


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ప్రేమికుల దినం

**ఫిబ్రవరి 14. ప్రేమికుల దినం నాకు మాత్రం క్షణం తీరికలేకుండా గడిచింది!**

తెల్లారకుండానే ఏదో రేడియో స్టేషన్ "మేడం ప్రేమికుల దినం ఏం చెపుతారు? ఏం చెపుతారని?" అడుగుతూ, వీళ్ళగొడవే కానీ `ఎవరు వింటారని?` ఏమీ తోచక మంచంలో పడుకున్నవాళ్ళూ, ఆఫీసులకి వెళ్ళడానికి ట్రాఫిక్ జాములల్లో చిక్కుపడ్డ కార్లల్లో వాళ్ళూనా? అసలు యువత మనమిచ్చే సందేశాల కోసం, సలహాల కోసం కాచుకుని కూర్చుందా?

ఈ సంవత్సరం మా తెలుగు సినీ రచయితల సంఘం ఎలక్షన్ల రోజున నాకు ఒంట్లో బాగుండక వెళ్ళలేదు. అందుకని నాకు ఏ జాయిట్ సెక్రెటరీ, వైస్ ప్రెసిడెంట్‌లాటి బాధ్యతాయుతమైన పోస్ట్‌లేవీ రావులెమ్మని హాయిగా ఇంట్లో కూర్చున్నాను.

"ట్రింగ్ ట్రింగ్"మని ఫోన్ మోగింది. అదీ చెవికింద... దిండు కింద ఉన్న సెల్ ఫోన్ తీసి చూస్తే మా గురువులూ, సినీ రచయితల సంఘం ప్రెసిడెంటు డా.పరచూరి గోపాలకృష్ణగారు. "అమ్మాయ్! నిన్ను మా కార్యవర్గం అంతా కలిసి కల్చరల్ సెక్రటరీగా ఎన్నుకున్నాం.. ఓ.కే.నా?" అన్నారు. నేను నోరు తెరిచే లోపునే చప్పట్ల మోత వినిపించింది. "మన మెంబర్లు కొట్టిన చప్పట్ల శబ్దం వినిపించిందా?" అన్నారు.

"వినిపించింది" అన్నాను. ఠపీమని లైన్ కట్ అయింది. అలా ఆన్‌లైన్ ఎలక్షన్ల ద్వారా నా ఎలక్షన్ ముగిసింది.

చిన్నప్పుడు స్కూల్లో కూడా కల్చరల్ సెక్రటరీగా ఉండేదాన్ని. గాంధీగారు పుట్టినరోజుతో పాటు పోయిన రోజు కూడా పిల్లలతో డాన్సులు చేయించాను. దాంతో మా హెడ్ మాష్టర్‌కి కోపం వచ్చింది. తెలుగు పండిట్ గట్టిగా చివాట్లు వేసారు. మా గ్రూప్ దేనికైనా డాన్సు చేసేసేది. "పగలే వెన్నెల" నుంచి "భళి భళి దేవా" వరకు. మాయా బజారులోని ఆ బండి పాటకు డాన్సు చేసిన వాళ్ళు ఎవరైనా ఉంటే అది మేమే. ఆ తర్వాత భాషా భావం తెలియక "చీకటిలో కారుచీకటిలో కాలమనే కడలిలో, శోకమనే పడవలో ఏ దరికో ఏ దిశకో" అన్న పాటకి డాన్సు టీచర్స్ డే రోజు చేశాక ఇంక సహనం నశించి మా సారు గోపాల్ రాజు భట్ గారి దగ్గర ఫోక్ డాన్సు నేర్చుకోమని పంపించారు. కాలేజీలో కూడా నాటకాలు రాసి డైరెక్ట్ చేయించి వేయించేదాన్ని. మీసాల వెంకటరత్నం నాయుడు అనే నాటిక అన్ని ఆడపాత్రలతో పుల్లదోశల రమణమ్మ అనే పేరుతో మార్చి డైరెక్ట్ చేసి వేయించాను. అలా కళాతృష్ణ పెరుగుతూ వచ్చి చివరికి ఇక్కడకి చేర్చింది.

"పోనీలే! ప్రతినెలా మీటింగులకి ఎటెండ్ అవకపోతే, గొడవలుండవు. ఎప్పుడైనా ప్రత్యేక సందర్భాలలో వెళ్ళొచ్చు" అనుకున్నాను. ఎందుకంటే ఈ మధ్య పెరిగిన పెట్రోల్ ఛార్జీల వల్ల నాకు 'గూబగుయ్యి'మనేటట్లు, మా ఏరియా నుండి జూబ్లీ హిల్స్ వెళ్ళొస్తే కేవలం ఆరువందలదాకా అవుతోంది. ఇలా అనుకుని సరిపెట్టుకుంటే, అమాంతం ప్రేమికుల రోజొచ్చింది!

సాదినేని జయశ్రీ అనే అమ్మాయి మంచి రంగస్థల నటి, టీ.వీల్లో ఆర్.నారాయణ మూర్తి సినిమాల్లో కూడా కనిపిస్తుంది! ఈ అమ్మాయి ప్రేమగీతాలతో 'అభిసారిక' అనే పుస్తకం రాసింది. మా గురువుగారు పరుచూరి వారి సలహాతో, మా రచయితల సంఘంలో విడుదల చెయ్యాలని సంకల్పించింది. నేను కల్చరల్ సెక్రెటరీ అయ్యాకా ఇది 'ఓం' ప్రారంభం.

పేదవాడి పెళ్ళిలా ఇంటి ముందు అలికి ముగ్గులు పెట్టి, పచ్చి కొబ్బరాకులతో పందిరేసినట్లు ఒక టెంటూ, వంద కుర్చీలూ, సాదినేని జయశ్రీ తెచ్చిన కూల్ డ్రింక్సూ, స్నాక్సుతో సభ జరిపేద్దాం అని నిశ్చయించుకున్నాం.

ఈలోగా నేనో తెలివైన పని చేసాను! కష్టపడి పని చేసే గుణం ఉన్న ఒక రచయితని 'కన్వీనర్'గా నియమించాను. అతని ఇంటి ఎడ్రెస్ ఆ దగ్గర్లోనే అని తెలుసుకుని మరీ నియమించాను. మిగతా సభ్యులు నన్ను బాగా గౌరవించేవాళ్ళూ, అక్కా అనిపించేవాళ్ళూనూ! దాంతో నాకు కొన్ని పనులు తప్పాయి, ముఖ్యంగా పిలుపులు!

మా గురువుగారు, నా బద్ధకం, నిర్లక్ష్యం తెలిసిన వారవడం చేత ఓ way to s.m.s అనే సాధనం ద్వారా అందరినీ నా పేరుతో పిలిచేసారు! మిగతావి 'కన్వీనర్', ఆ పుస్తకం రచయిత్రి జయశ్రీ చూసుకున్నారు.

ఈలోగా నేను సిట్టింగులో ఉండే మా 'కన్వీనర్'ని "అన్ని ఏర్పాట్లూ అయాయా?" అని కంగారు పెట్టాను. అందరికన్నా ఆలశ్యంగా వెళ్ళింది నేనే! డా.పరచూరి గోపాలకృష్ణగారు, దర్శకులు సాగర్ గారికి పుస్తకం ఆవిష్కరించి ఇచ్చేటట్లు నిర్ణయం అయింది. గీత రచయితలైన, 'అందెశ్రీ' గారినీ, రామజోగయ్యశాస్త్రిగారినీ వేదిక మీదకి పిలిచాం. మొదట జ్యోతి ప్రజ్వలన. తరువాత నా అధ్యక్షోపన్యాసం తరువాత దర్శకులు సాగర్ గారూ, డా.పరచూరిగారూ, అందెశ్రీ ఆకెళ్ళ, రామజోగయ్యశాస్త్రి, జనార్ధన మహర్షి, సుద్దాల అశోక తేజగార్లు ప్రసంగించారు! ఇది జరిగిన విషయం.. అయితే ఇంత విపులంగా ఎందుకు రాసానంటే, ఆ ప్రసంగాలలో విషయం నన్ను ఆశ్చర్యపరిచింది!

అందెశ్రీ "ఏంటమ్మా ఇంకా 'అభిసారిక' అని పేరు పెట్టి 'నువ్వెప్పుడొస్తావురా? నేను నీ కోసం ఏడుస్తున్నాను... నన్ను వదిలి పెట్టకు..! అని కవితలు రాస్తావు... చైతన్యంతో విప్లవగీతాలు రాయి. పోతే పోరా.. నువ్వు రాకపోతే నాకేంది.. ఇంకో పనిలేదా? నువ్వే నష్టపోతావు, అని రాయి, స్త్రీలలో చైతన్యం రావాలి, ఉద్యమ స్ఫూర్తి ఉండాలి" అని ఇంకా ఏదో చెప్పారు.

ఆకెళ్ళగారు కూడా "ఈ అమ్మాయి కలం నుండి కేవలం ప్రేమ కవితలు కాకుండా స్త్రీ చైతన్యంతో కూడిన సామాజిక స్పృహ ఉన్న రచనలు రావాలని ఆకాంక్షిస్తున్నాను" అన్నారు.

ప్రతివాళ్ళూ తమ అభిప్రాయాలు చెప్పారు.

నాకు అర్ధంకానిదల్లా ఆ అమ్మాయి చిన్న వయసులో, ప్రేమించే, ప్రేమించగలిగిన, ప్రేమింపబడగలిగిన వయసులో ప్రేమ కవితలు కాక, చైతన్య విప్లవగీతాలు ఎందుకు రాయాలి? ఆర్.నారాయణమూర్తి సినిమాలో నటించడం వలనా? అసలు ప్రేమ ఈ వయసులో అర్ధరహితంగా కనిపిస్తోందేమో కానీ, వాళ్ళూ వయసులో ఉండగా దీన్ని చవిచూసిన వాళ్ళేగా!

మా బామ్మ మేం చేగోడీలు తింటూంటే, "కటకటమని నములుతుంటే, పళ్ళు నెప్పులు లేవూ?" అనేది, ఆవిడకి ఉన్నాయి కాబట్టి మాకూ ఉంటాయి అనుకునేది!

నేనేం ఊరుకోలేదు.. ఆ సభలో మైక్ నా చెప్పుచేతల్లో ఉంటుంది. అధ్యక్షురాలిని కాబట్టి, అందుచేత 'ఈ ప్రేమ అనే ఎలిమెంటు మీద నవలలూ, సినిమాలూ అమ్ముకుంటున్న వాణిజ్యంలో భాగం అయిన మనం ఇలా డిస్కరేజ్ చెయ్యడం తగదు, పైగా స్త్రీ

పురుషుల మధ్య ఈ ప్రేమని బాగా ఎంకరేజ్ చేయాలి. ఎందు కంటే వయసు వచ్చాకా, ఓ అబ్బాయి, అబ్బాయితోనే తెగ తిరుగుతున్నా, ఓ అమ్మాయి ఇంకో అమ్మాయితో తెగ మాట్లాడుతున్నా, ఓ అమ్మాయి ఇంకో అమ్మాయితో తెగ మాట్లాడుతున్నా, 'హైకోర్టు' పుణ్యమా అని తల్లిదండ్రులకి తెగ కంగారుగా ఉంటోంది! అందుకే పెళ్ళిళ్ళు ఇదివరకన్నా గ్రాండ్‌గా లక్షలు వెదజల్లి చేస్తున్నారు!" అని గట్టిగా నొక్కి వక్కాణించాను.

ఈలోగా ఓ ప్రమాదం సంభవించింది! కుమారి సాదినేని శ్రీజ పేరుతో ఈ జయశ్రీ పుస్తకావిష్కరణ ఇక్కడ చెయ్యడం వల్ల స్ఫూర్తి పొంది ఇంకో నలుగురు రచయితలు అర్జెంటుగా, మా పుస్తకావిష్కరణ కూడా ఇక్కడే ఇలాగే రచయితల సంఘం ముందు (అప్పుడప్పుడూ గాలి వీస్తుంటే కొంచెం మురుగు వాసన మినహా అన్నీ బావుంటాయి! అందుకు మేం అంబికా దర్బార్ బత్తీ ఎలాగో వెలిగిస్తాం) జరిపిస్తాం. అని కల్చరల్ సెక్రెటరీ అయిన నా ఆమోదం కోరారు. పైగా నెలకి ఓసారి ఇలాగే ఇంతమంది కలిసే ఓ కల్చరల్ మీట్ విధిగా ఉండాలి అని తీర్మానించారు. దాంతో నాకు కార్యవర్గ సభ్యుల్లో అందరికన్నా ఎక్కువ బాధ్యత పెరిగింది! మొదట సభే కిటకిటలాడి జయప్రదంగా జరుగుతోంది.

ఇంతలో కుమారి శ్రీజ తన ఇంకో బాంబు పేల్చింది!

"పరచూరి రఘుబాబు నాటకాల ద్వారా నేను ఈ స్ఫూర్తిని పొందాను. నాకు గురువుగారు మా ఆకెళ్ళగారే, ఎందుకంటే నేను ఓ నాటకం రాసివ్వమని కోరాను.. ఆయన నేను పెద్ద సమాజాల వాళ్ళకే రాసిస్తాను.. నీకు రాసివ్వను అన్నారు. శ్రీ జనార్ధన మహర్షిని కోరాను... ఆయన కూడా చూద్దాం అన్నారు. అందుకే నేను ఓ నాటకం రాసుకున్నాను. ఇప్పుడు గీతాలు కూడా రాసి పుస్తకం వేయించుకున్నాను. నా వినతి తిరస్కరించిన ఆ ఇద్దరూ నాకు గురువులతో సమానం!" అంది. ఇది పొగడడమా!.. ఏది ఎలా ఉన్నా, నన్ను 'అక్కా' అంటుంది కాబట్టి 'శ్రీజ'కి మంచి భవిష్యత్తు ఈ రంగంలో ఉండాలని ఆశీర్వదిస్తున్నాను

ఈలోగా ఇంకా ఎవరెవరో మాట్లాడ్తామని వస్తున్నారు. కానీ నేను 6.30కి వనిత టీ.వీ లైవ్ షోలో గ్రూప్ డిస్కషన్‌లో మాట్లాడతానని మాటిచ్చాను. అందుకని పబ్లిక్ ఫోన్ బూత్ ఓనర్‌లాగా 'రెండు నిమిషాలు' అని ప్రతి వాళ్ళనీ హెచ్చరించి, మా ఉమర్జీ అనూరాధ చేత వందన సమర్పణ చేయించేసి అక్కడికి పరిగెత్తాను.

నేనే ఆలశ్యంగా వెళ్ళాను అనుకున్నాను. ఎందుకంటే నేను వెళ్ళగానే మొదలెట్టేసారు. కానీ నాకన్నా ఆలశ్యంగా ఇంకో ఇద్దరు వచ్చారు. పేర్లెందుకులెండి బాధపడతారు... ఒక ఫెమినిస్టూ, ఒక సైకాలజిస్టూ, వయసు బాగా పైబడిన ఓ రచయిత్రీ నాతోబాటు ఉన్నారు. ప్రగతి ఏంకర్‌గా వ్యవహరించింది. ప్రగతీ, ఝాన్సీ, సుమా లాంటి ఏంకర్లు, తమ స్వంత భావాలు కూడా ప్రతిబింబిస్తూ, ఆలోచింపచేస్తూ మాట్లాడతారు. డైరెక్టర్ చెప్పినది బట్టీ పట్టి మాట్లాడరు! ఇంకొక ఆనందం, స్వచ్ఛమైన, అందమైన తెలుగు మాట్లాడతారు.

'ప్రేమ స్త్రీ దృక్కోణం నుండి ఎలా ప్రతిబింబించాలి? అటువంటి సినిమాలూ, రచనలూ ఎందుకు రావు? ప్రేమ ఎప్పుడూ పురుషుడి వైపునుండే అతని ఆధిక్యత చూపుతూ ఎందుకుంటుంది?' అన్నది చర్చ... అని నాకు చర్చ మొదలయిన కాసేపటికి కానీ అర్థం కాలేదు. అసలు ఇప్పటికీ నా పాఠకులకి అర్థం అయి ఉండదని నేను గ్యారంటీగా నమ్ముతున్నాను. అసలు 'దృక్కోణం' లాంటి మాటలెందుకండీ? స్త్రీ వైపు నుండి అంటే మనకి అర్థంకాదా ఏవిటీ?

ఫెమినిస్టులు ఎప్పుడూ ఒకే రకంగా మాట్లాడతారు. స్త్రీ ధోరణిలో. అందుకే వాళ్ళని ఫెమినిస్టులన్నారు. నన్ను అనరు.. అనలేరు కదా! ఆవిడ ఎంతో సీరియస్ ప్రశ్న, ఉదాహరణకి యాసిడ్ దాడుల గురించడిగినా 'నవ్వే'! మాటకి ముందు అంత నవ్వు ఎందుకో అర్థంకాలేదు!

ఎప్పుడూ స్త్రీనే ఎందుకు ప్రేమించాలి? అన్న ధోరణి కనిపించింది. కానీ నాకు అర్థం కానిదల్లా స్త్రీ ప్రేమిస్తున్నది పురుషుడినే కదా! ప్రపంచంలో స్త్రీ పురుష సంబంధాలన్నీ ఈ ప్రేమ చుట్టూ తిరక్కతప్పదు కదా!

ఇంక సైకాలజిస్టు మాట్లాడుతుంటే నాకు నవ్వాగలేదు. ప్రగతి గమనించి ఎందుకు నవ్వుతున్నారు అని అడిగింది!

ఆయన అంటాడూ "ఇది.. అంటే ప్రేమ.. ఒక శాస్త్రం, దీనికి కోచింగ్ క్లాసులు కావాలి.. అధ్యయనం అనవసరం. అమ్మాయీ, అబ్బాయీ అనుభవం, అవగాహనా లేకుండా, సరైన కౌన్సిలింగ్ లేకుండా ఇలాంటి వాటి జోలికి పోకూడదు," అంటూ సైంటిఫిక్ రీసెర్చ్, స్టాటిస్టిక్స్ ద్వారా ఈ స్త్రీ, పురుష కెమిస్ట్రీ గురించి మా అందరికీ కౌన్సిలింగ్ ఇవ్వసాగాడు.

ప్రగతి ఎందుకు నవ్వుతున్నారు అంటే నేను చెప్పాను. "వయసొచ్చాకా ఓ అమ్మాయికి ఓ అబ్బాయిని చూస్తే ఆకర్షణ కలుగుతుంది. అది ప్రేమగా మారుతుంది. స్పర్శ ద్వారా వ్యక్తీకరించుకోవాలనిపిస్తుంది. దిసీజ్ దిస్ సింపుల్! అంతే కానీ కౌన్సిలింగ్‌లూ, కోచింగ్‌లూ తీసుకుందాం రమ్మంటే ఏ అమ్మాయీ బుర్ర ఊపి వెంట వెళ్ళదు. అసలు ఈ కెమిస్ట్రీలు, ఫిజిక్సులూ అంటే తెలీని చదువురాని వాళ్ళు కూడా ప్రేమించేసుకుంటారు. ఇది సృష్టి సహజం. అవగాహనా, అనుభవం, విజ్ఞతా అన్నీ తెలిసే వయసా అదీ? పైగా ఇని కాలిక్యులేషన్స్‌లో చేసేది ప్రేమా? "నేను ఇలా అంటే ఆయనకి కోపం వచ్చింది. "రావడం సహజం కదా! అన్నింటికీ కౌన్సిలింగ్ తీసుకోవాలి.. ఇది ఒక సైన్సే! ఇంకా ఈ ప్రేమ అనే శాస్త్రం మీద విస్తృతమైన పరిశోధనలు జరగాలి. మనం మనదేశం వెనకబడిపోవడానికి కారణం ఈ పరిశోధనలు జరగకపోవడమే, కాలిక్యులేషన్లు ఉండాలి, యువతీ యువకులు వయసు రాగానే డెఫినెట్‌గా ప్రేమించుకోడానికి కోచింగులు తీసుకోవాలి" అన్నాడు.

పాపం.... ఇప్పటి పిల్లలకి పదోక్లాసు నుండే ఎం.సెట్ కోచింగులు, తర్వాత ఈ టీ.వీల పుణ్యమా అని సంగీతమో డాన్స్‌లో, ఇన్ని శిక్షణలలో అన్నం తినడానికి తీరుబడి, లేకుండా ఉన్నారు. ఇంకా ఈ 'ప్రేమ శిక్షణ'లు ఎక్కడ తీసుకుంటారు చెప్పండి?

ఇంతలో పెద్దావిడ "అసలు ఈ యువతీ యువకులలో ప్రేమల పేరిట జరుగుతున్న అత్యాచారాల వల్లేగా మనకు అసలు ప్రేమ పట్ల వ్యతిరేకతా" అని చెప్పుకొచ్చారు. అత్యాచారాలు జరిగితే వాటి పట్ల ఉండాలి కానీ, ప్రేమ పట్ల ఎందుకుండాలో వ్యతిరేకత నాకు అర్థం కాలేదు!

ఆ తరువాత కాసేపు నా ప్రెజన్స్ ఆఫ్ మైండ్ అక్కడ లేదు. గొడవగా ఏదో చర్చ జరిగింది. నేను తెప్పరిల్లేటప్పటికీ "ముగించ బోయేముందు ప్రేమ గురించి ఒక వాక్యం చెప్పండి రమణీగారూ!" అని ప్రగతి అడుగుతోంది.

**"ప్రేమ ఒక వరం! ప్రేమించలేకపోవడం అవకరం!"** అని చెప్పి, నా యతీ ప్రాసకి నేనే 'శభాష్' అనుకుని బయటపడ్డాను, అసలు అంతకు ముందు రెండురోజులుగా కూడా నేను సాహిత్యసమావేశాల్లో పాలు పంచుకుంటూ బిజీగా ఉన్నాను.

మా పాతూ్తరి విజయలక్ష్మి 'కేంద్ర సాహిత్య అకాడమీ' వాళ్ళు కండక్ట్ చేస్తున్న, లేఖినీ ఆధ్వర్యం (స్త్రీల)తో జరిగే సమవేశాల్లో, కథాపఠనం అనే సెగ్‌మెంట్‌కి నన్ను సమావేశకర్తగా ఉండాలని ఫోన్ చేసింది. అలవాటుగా ఎగ్గొడదామనుకుని కూడా, తిడుతుందని భయపడి వెళ్ళాను. అవి ఫిబ్రవరి 11, 12 తేదీల్లో రవీంద్రభారతిలో జరిగాయి. అక్కడ నిన్నటి తరం, నేటి తరం రచయిత్రులని చాలామందిని కలిసాను. ఆశ్చర్యంగా మా తరువాతి తరం రచయిత్రులని కూడా ఒకరిద్దరిని చూసాను. విచిత్రంగా మగ రచయితలు కూడా కనిపించారు. అందులో ప్రముఖంగా రాజారామోహన్ రాయ్, చందుసోంబాబు, జగన్నాధశర్మ ఉన్నారు. ఈ జగన్నాధ శర్మతోటి ఈటీవి లో ఉండగా గొడవైంది. దాదాపు పదేళ్ళగా మాట్లాడలేదు. ప్రస్తుతం నవ్యకి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కానీ ఎంతో ప్రేమగా నేను మాట్లాడాక స్టేజ్ మీదకి వచ్చి నాకు ఫోటోలు తీయించి శర్మని మర్చిపోయావేంటి రమణి మనం పాత కొలీగ్స్ కదా అని ఆర్ద్రంగా మాట్లాడాడు. పెద్ద కారణంతో మాట్లాడటం మానేసినా ఇన్నేళ్ళ తర్వాత ఎంతో స్నేహాభిమానాలు చూపించాడు. నవ్యకి తప్పకుండా సీరియల్ రాయాలి , అని మరీ మరీ అడిగాడు. కానీ ఏ కారణం లేకుండానే ఓ ఫెమినిస్టు రచయిత్రి చిరునవ్వు నవ్వితే మొహం తిప్పుకుని వెళ్ళిపోయింది. బహుశా ఆడవాళ్ళంటే చిరాకేమో.

రాసేవాళ్ళందరూ రచయితలు కారు! ఆ రచనలో స్పందింపచేసే భావ ప్రకటన ఉండాలి. 'షాజహానా' అనే ఒక యువరచయిత్రి కథ చదువుతుంటే నాకు మనసు స్పందించింది. 'ఒక పచ్చి ఇటుక'లాంటి నాకథ చదువుతాను. దీని పేరు 'దీవార్' అని ఆ అమ్మాయి తను కట్టుకున్న రెండుగదుల ఇల్లు గురించి కథ చదవడం ప్రారంభించింది. నా కళ్ళలో నీళ్ళు, అందులో కష్టాల గురించి కాదు, ఆ అమ్మాయి రచనా విధానం వల్ల కలిగిన ఆనందంలో, వచ్చాయి! ఆ కథా సారాంశం ఇది...

'దాదీ' ఉండడానికి ఇంట్లో స్థలం చాలక తండ్రి ఆమెని బాబాయి ఇంటికి పంపేస్తూ ఉంటాడు. దాదీ, బాబాయ్ తాగొచ్చి తిట్టే బూతులు విని సహించలేకపోయినా తప్పని పరిస్థితుల్లో వెళుతూ ఉంటుంది. అందుకు తండ్రి బాధపడి ఈ అమ్మాయిని రెండు గదుల ఇల్లు ఎక్స్టెన్షన్‌గా దగ్గరుండి వేయించమని కోరతాడు. ఈమె సరేనంటుంది. ఒక నెల్లూరి మేస్త్రీని అందుకు నియమిస్తారు. పనివాళ్ళూ, వాళ్ళ బూతులూ అన్నీ భరింపశక్యం కాకుండా ఉంటాయి. ఒకనాడు అవి ఆగిపోతాయి. ఎందుకంటే వాళ్ళల్లో మగాళ్ళు భవానీ మాత దీక్ష తీసుకుని 'స్వామి' అయిపోతారు. వాళ్ళు 'మాతా' అని ఈ అమ్మాయిని సంబోధిస్తుంటారు. అప్పుడు రచయిత్రి రాస్తుంది కదా "తరతరాల తమ అంటరానితనం వల్ల 'అరెయ్.. ఒరెయ్' అని పిలిపించుకుంటూ తక్కువగా చూడబడుతున్న ఒక వర్గం 'స్వామీ' అని ప్రతి ఒక్కరి తోటీ పిలిపించుకుని గౌరవింపబడే ఒక సంతృప్తికోసం ఈ 'దీక్ష'లు చేపట్టడం లేదుకదా' అని. ఆ తరువాత ఆ నిర్మాణం కోసం నరకబడిన చెట్లూ, ఆ చెట్లమీద నివసించే పక్షులూ, సీతాకోక చిలుకలు గురించి మాట్లాడుతుంది. ఓ సీతాకోకచిలుక అంటుంది "నీ ఆశ్రితం  కోసం మమ్మల్ని నిర్వాశితుల్ని చేసావు.. నేను నీళ్ళల్లో పడిపోయాను.. నా రెక్కలు తడిసిపోయాయి నేను ఎగరలేను... తరతరాలుగా ఇక్కడ నివసిస్తున్న ఈ ప్రాణులని నువ్వు ఎక్కడ నివసించమంటా? అలవాటయిన ఈ చావు వదిలి ఎక్కడికి ఎగరమంటావూ?" అని. రచయిత్రికి పోలవరం నిర్వాశితులు గురించి ఆలోచనవస్తుంది! నిజమే కదా.. వాళ్ళ గోడు దూరం నుండి చూసేవారికి అర్థంకాదు. ఆ రెక్కలు తడిస్తే ఎగరలేని చిలుక బాధ దానికే అర్థం అవుతుంది!" అని.

ఇల్లు పూర్తయి దాదీకి ఎటాచ్డ్ బాత్ రూం కూడా కట్టించి, దానికి ఇంకో రెండువేలు అధికం అయినా ఆనందపడి, దాదీని తీసుకురావచ్చు అనుకుంటుండగా కబురువస్తుంది. తామే 'చిచ్చా' ఇంటికి వెళ్ళాలనీ, దాదీ ఇక లేదనీ. దాదీకి నాలుగు అడుగుల శాశ్వతమైన ఇల్లు భూమి అడుగున నిర్మించారు. అసలు 'ఇల్లు' అంటారు. నా ఇల్లు ఏదీ? అందరూ ఇళ్ళు కట్టుకుంటారు వాళ్ళకి తెలుసా వాళ్ళ 'ఇల్లు' ఏదో?" అని రచయిత్రి కథ ముగించింది.

నేనైతే ఆ పిల్లని ప్రేమగా కౌగలించేసుకున్నాను! ఎంత ముద్దొచ్చిందో...  మా తర్వాతి తరం కూడా స్పందింపచేసే విధంగా, ఆలోచింపచేసే విధంగా,  రాసేవాళ్ళు రేపటితరానికి కూడా ఒక తరం రచయిత్రులు తయ్యారవుతున్నారు అని గర్వంగా అనిపించింది.

ఇప్పుడు మళ్ళీ ప్రేమికుల దినం కొద్దాం! అసలు మా రోజుల్లో ప్రేమని వ్యక్తపరచడానికి 'ఉత్తరం' తప్ప సాధనాలు లేవు. టెలిఫోన్ కోసం నేను మా ఇంటి దగ్గరున్న 'పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్స్' ఆఫీసుకెళ్ళి మా కాబోయే శ్రీవారికి ఫోన్ చేసేదాన్ని అప్పట్లో.... అక్కడే ఉద్యోగం చేస్తున్న మా బలరాం బాబాయ్‌కి మా 'విషయం' అర్థమయి పోయింది కూడానూ! అలా మా ప్రేమ బయటపడింది. అలాంటిది ఇప్పుడు, ఈ మెయిల్స్, ఎస్.ఎం.ఎస్‌లు, సెల్ ఫోన్లు వచ్చాకా వాళ్ళు ఊపిరి పీల్చి వదిలినా వీళ్ళకి వెంటనే తెలిసిపోతోంది.

ఇంక 'ఫేస్‌బుక్'ల పుణ్యమా అని, ఎవరికి 'బ్రేకప్' అయిందో, 'మేకప్' అయిందో అన్నీ నిమిషాల మీద ప్రపంచానికి తెలిసిపోవడం ఫ్యాషన్ అయిపోయింది.

నాతో 'నువ్వు మాఫేస్ బుక్‌లో ఉండద్దూ' అని పిల్లల గోల!

"హాయ్ ఫోక్స్.. నేను ఇవాళ కాఫీ మానేసాను" అంటుంది ఒకర్తి.

"హాయ్ ఎవ్రిబడీ ఐ యామ్ కమిటెడ్ ఫ్రం టుడే. షి ఈజ్ స్వాతీ" అంటాడు ఒకడు.

"నా ఎర్ర చారల అండర్ వేర్ హాస్టల్లో పోయిందిరా.. ఎవరు తీసారో ఇచ్చెయ్యండిరా" అని ఇంకొకడి గోల!

"నా బ్లౌజులు టైట్ అయిపోయాయి.. ఇంక స్వీట్లకీ, చాక్లెట్లకీ దూరంగా ఉంటాను" అని ఇంకొక పిల్ల ఏడుపు.

"పెళ్ళి అంటే ఇంత బావుంటుందా? ముంబై నుండి వెళ్ళి సౌత్ ఇండియన్ ఫ్యామిలీలో పడ్డాను... ఇక్కడ పొంగల్ ఎంత బాగుందో" అని ఇంకొక కొత్త కోడలు...

"లోకం అంతా చీకటైపోయింది.. ఆ అవినాష్‌గాడు ఉత్తఫూల్.. వాడితో రెండేళ్ళు వేస్ట్ చేసాను అనవసరంగా" అని ఇంకొక పిల్ల ఏడుపు, మరునాడే " ఐ యామ్ హేపీ.. నేనూ స్వరూప్ డేటింగ్‌లో ఉన్నాము" అని మళ్ళీ ఎనౌన్స్ మెంటు!

ఇలా భావప్రకటనలకి ఎల్లలు లేని ఈ కాలంలో... ప్రేమికులకి ఒక్క దినం సరిపోతుందా? ఇలా క్షణం క్షణం వాళ్ళు ఏం చేస్తున్నా ఒకే ఒక ప్రేయసీ, లేదా ప్రియుడికీ అయితే కష్టం కానీ గ్రూప్ ఆఫ్ ప్రేమికులకి చెప్పాలంటే 'ఫేస్‌బుక్కే' శరణ్యం!

ఈ మధ్య మా పిల్లలు "ఆ ప్రియ మనోడికి 'బిస్కట్' ఇచ్చిందిరా.. ఆ శరణ్య కూడా విష్ణుగాడికి బిస్కెట్ ఇచ్చినట్టుంది, వాడుఫేస్ బుక్‌లో 'లైఫ్ ఈజ్ బిట్టర్' అని పెట్టాడు" అని మాట్లాడుకోవడం వింటున్నాను. బిస్కెట్ అంటే 'బ్రేకప్' అవడం అని అర్థం అయింది. ఈ 'బిస్కెట్' అనే పేరడీ కూడా' ఏం మాయచేసావో' సినిమా మీద ఈ మధ్య 'యూ ట్యూబ్' లో చూసాను.

పోనీలెండి 'లైలా మజ్నూ', 'దేవదాసు'ల్లా కాకుండా ఈ కాలం పిల్లలు 'బిస్కెట్ల'కి అలవాటు పడి వెంటనే తేరుకుని మరో 'చాక్లెటు'ని చూసుకుంటున్నారు. ఇది ఆనందించతగ్గ మార్పు.

**సర్వ ప్రేమికులూ సుఖినో భవంతు!**

**NEW**
Click here to share your comments on this article